## క్లుప్తంగా

### నేడు మండల సర్వసభ్య సమావేశం

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలోని అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. సమావేశంలో 14 ప్రభుత్వ శాఖల అభివృద్ధి, పనితీరుపై సమీక్ష సమావేశం ఉంటుందన్నారు.

### కంది, సద్ద పంట ధ్వంసం



తొలగించిన పంటను చూపుతున్న రైతు

యాడికి: మండలంలోని వీరన్నపల్లెలో దుండగులు కంది, సద్దను తొలగించారని, రూ.10వేల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు కంబగిరి స్వామి ఆవేదన వ్యక్తం చేశాడు. బాధిత రైతు వివరాల మేరకు.. గ్రామ సమీపంలో సర్వే నంబర్ 273–1లో గల నాలుగు ఎకరాల విస్తీర్ణంలో అతడు కంది, సద్ద పంటను సాగు చేశాడు. గురువారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు పొలంలో నాలుగు చోట్ల రెండు సాళ్ల ప్రకారం తొలగించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతు తెలిపారు.

### 'రాత్రికి రాత్రే అక్రమంగా బోరు వేశారు'

శింగనమల: గ్రామానికి తాగునీరు అందించే బోర్ల పక్కలోనే టీడీపీ నాయకుడు రాత్రికి రాత్రే బోరు వేశారని , దీనిపై చర్యలు తీసుకోవాలని సలకంచెరువు గ్రామస్తులు తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సలకంచెరువు సమీపంలోని చెరువులో గ్రామానికి తాగునీరు అందించే బోర్లు మూడు ఉన్నాయన్నారు. వీటికి సమీపంలోనే బోరు వేయాలని ఇటీవల టీడీపీ నాయకుడు ప్రయత్నించారని, అధికారులు అడ్డు చెప్పడంతో విరమించుకున్నారన్నారు. కాని బుధవారం రాత్రికి రాత్రే బోరు వేశారని, దీంతో గ్రామంలోకి వచ్చే తాగునీటికి ఇబ్బంది అవుతుందన్నారు. అధికారులు స్పందించి ఆ బోరును సీజ్ చేయాలని వారు కోరారు.

### పాఠశాలకు విరాళం



నగదు అందజేస్తున్న సీఐ నాగార్జునరెడ్డి

యాడికి: మండలంలోని వేముల పాడు ప్రాథమికోన్నత పాఠశాలకు సీఐ నాగార్జునరెడ్డి గురువారం రూ. 10 వేలు విరాళం హెచ్‌ఎంకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం తన వంతు సహాయం అందజేశానన్నారు. దాతలు ముందుకొచ్చి పాఠశాల అభివృద్ధికి పాటు పడాలన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నానన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని ఆయన సూచించారు.

### కృష్ణాష్టమి నిర్వహణకు అనుమతివ్వండి

గుంతకల్లు రూరల్: మండల పరిధిలోని నక్కనదొడ్డి, నరసాపురం గ్రామాల్లో ఈ నెల 26 నుంచి 29 వరకూ నాలుగు రోజుల పాటు కృష్ణాష్టమి ఉత్సవాలు నిర్వహించనున్నారు. అందుకు అనుమతి కోరుతూ త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కసాపురం పోలీసులకు వినతిపత్రం అందజేశారు.

### రక్తదాతలందరూ ప్రాణ దాతలే



రక్తదానం చేస్తున్న గేట్స్ యాజమాన్యం, విద్యార్థులు

గుత్తి: రక్తదాతలందరూ ప్రాణ దాతలేనని సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్ (సీజీఎస్టీ) అనంతపురం డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ అనిత అన్నారు. గుత్తి శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్ అధికారుల ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. అనంతరం గేట్స్ ఎండీ రఘునాథ్‌రెడ్డి, డైరెక్టర్ వీకే వాణితో పాటు సుమారు వంద మంది ఇంజినీరింగ్ విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మానవతా రక్తదాతల సంస్థ ప్రతినిధి అమర్‌నాథ్‌రెడ్డి, గేట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

# బండారు స్వగ్రామంలో చుక్కెదురు!

- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో ఎమ్మెల్యే శ్రావణి వర్గీయుల ఓటమి
- ద్విసభ్య కమిటీ సభ్యుల మద్దతుదారుల విజయం



నార్పల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సమావేశమైన టీడీపీ నాయకులు

బుక్కరాయసముద్రం: పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికల్లో శింగమనల ఎమ్మెల్యే బండారు శ్రావణికి చుక్కెదురైంది. ఎస్‌ఎంసీ ఎన్నికలు రాజకీయాలకు అతీతంగా జరగాలి. ఇందులో కూడా టీడీపీ ప్రభుత్వం రాజకీయంగా జోక్యం చేసుకోవడంతో పాటు తెలుగు తమ్ముళ్ల మధ్యనే పోటీ ఉండడం బీకేఎస్ మండలంలో చర్చనీయంశంగా మారింది. మండలంలో 57 ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలో ప్రతి పక్షం కంటే అధికారం పక్షంలోనే పోటీ నెలకొంది. ఎమ్మెల్యే బండారు శ్రావణి, ద్విసభ్య కమిటీ సభ్యుల వర్గీయులు పోటీ పడ్డారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి సొంత గ్రామం అయిన సిద్దరాంపురం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఎన్నికల్లో బండారు శ్రావణికి చుక్కెదురైంది. పాఠశాలలో 24 మందికి సభ్యులకు గాను 23 మంది ద్విసభ్య కమిటీ సభ్యులు మద్దతుదారులు గెలుపొందారు. ఎమ్మెల్యే వర్గీయులు ఒక్కరు మాత్రమే గెలుపొందడంతో ద్విసభ్య కమిటీ వర్గీయులు ఆనందోత్సవాలతో ఊరేగింపు నిర్వహించారు. దయ్యాలకుంటపల్లిలో నిర్వహించిన ఎన్నికల్లో ఎమ్మెల్యే, ద్విసభ్య కమిటీ వర్గీయులు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. టీడీపీ నాయకుడు పెద్దప్పను మరోవర్గం వారు కొట్టారు.

**హెచ్‌ఎంపై ఎమ్మెల్యే తల్లి ఆగ్రహం**

సిద్దరాంపురం గ్రామంలో నిర్వహించిన స్కూల్ కమిటీ ఎన్నికల్లో ఎమ్మెల్యే బండారు శ్రావణి వర్గీయులు పరాజయం పాలయ్యారు. దీంతో చైర్మన్ ఎన్నికను నిలిపివేయాలంటూ ఎమ్మెల్యే బండారు శ్రావణి తల్లి నీలావతి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజకు ఫోన్ చేసి బెదిరింపులకు దిగారు. దీంతో పాఠశాలలో కాసేపు యుద్ధ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న ద్విసభ్య కమిటీ మద్దతుదారుడు జెడ్పీ మాజీ సభ్యుడు రామలింగారెడ్డి తదితరులు సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బందిని తీసుకెళ్లి చైర్మెన్ ఎన్నికను సజావుగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు.

**పోలీసు బందోబస్తు మధ్య..**

తాడిపత్రి రూరల్: తాడిపత్రి పట్టణ, రూరల్‌లో గురువారం పోలీసు బందోబస్తు మధ్య ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 85 పాఠశాలలు ఉండగా 59 స్కూళ్లల్లో ఏకగ్రీవం కాగా 26 పాఠశాలల్లో పోటీ నెలకొనడంతో ఓటింగ్ జరిగింది.

గుంతకల్లు/రూరల్: గుంతకల్లు మున్సిపాలిటీ పరిధిలో గురువారం నిర్వహించిన పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు సజావుగా జరిగాయి. మొత్తం 46 మున్సిపల్ పాటశాలల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకున్నట్లు ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు తెలిపారు పట్టణంలోని ఎస్‌జేపీ హైస్కూల్ ఎస్‌ఎంసీ ఎన్నికలను ఎంపీడీఓ శ్రీకాంత్‌చౌదరి పర్యవేక్షించారు. అలాగే మండలంలోని 48 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించామని ఎంఈఓ మస్తానప్ప తెలిపారు. ఇమాంపురంలో కోరం సభ్యులు లేకపోవడంతో ఎన్నికలు వాయిదా వేశామన్నారు.

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలో గురువారం స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శింగనమల: మండలంలోని 52 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ నరసింహరాజు తెలిపారు. మండలంలోని జూలకాల్వ ప్రాథమిక పాఠశాలలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గెలుపొందగా, టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. పోలీసులు వెళ్లి ప్రశాంతంగా ఎన్నిక నిర్వహించారు.

యల్లనూరు: మండల వ్యాప్తంగా 38 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు సజావుగా సాగాయి. తహసీల్దారు నాగరాజు పరిశీలించారు. ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి, ఏఎస్‌ఐ సంపత్‌కుమార్, శ్రీనివాసులగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని 46 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించామని ఎంఈఓ రాముడు తెలిపారు. ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప బందోబస్తు ఏర్పాటు చేశారు.

యాడికి: మండలంలోని 50 ప్రభుత్వ పాఠశాలల్లో గురువా స్కూల్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ కాశెప్ప తెలిపారు.

పామిడి: మండలవ్యాప్తంగా ఎంఈఓ జయానాయక్ పర్యవేక్షణలో 42 పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. గజరాంపల్లిలో ఎస్‌ఎంసీ ఎన్నికలు మా కొద్దు అంటూ పిల్లలు తల్లిదండ్రులు విద్యాశాఖాధికారులకు లేఖలు రాయడంతో ఎస్‌ఎంసీ ఎన్నిక వాయిదా అనివార్యమైంది. ఇక జీఏ కొట్టాల ప్రైమరీ, ఖాదర్‌పేట జెడ్పీహెచ్‌లో కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయి

### టీడీపీ నాయకుల వర్గపోరు

నార్పల: మండల కేంద్రంలో గురువారం జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో టీడీపీ నాయకుల మధ్య వర్గపోరు తీవ్రస్థాయిలో జరిగింది. వారి పిల్లలు ఆయా పాఠశాలల్లో చదువుకోకున్నా.. ఎన్నికల నిబంధనలు ఉల్లఘించి టీడీపీ నాయకులు వారి అనుచర వర్గంతో పెద్దఎత్తున చేరి ఎన్నికలకు అడ్డంకులు సృష్టించారు. మా అభ్యర్థి ఉండాలంటే, మా అభ్యర్థి ఉండాలని తీవ్రస్థాయిలో మాటల యుద్ధం చేసుకున్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో టీడీపీ ముఖ్య నాయకులైన ఆలం వెంకటనరసానాయుడు, ఆకుల ఆంజనేయులు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదాలు జరగగా సీఐ శ్రీధర్ ఇద్దరినీ బుజ్జగించే ప్రయత్నం చేశారు. చివరకు కోరం లేని కారణంగా అధికారులు ఎన్నికలను వాయిదా వేశారు. పాఠశాల్లో ఎన్నికలకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తిగా ముందుకు వచ్చినా వర్గ రాజకీయాలకు తలొంచి వెనుదిరిగారు. మండల వ్యాప్తంగా 48 పాఠశాలలకు ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. నాలుగు పాఠశాలల్లో టీడీపీ నాయకుల మధ్య వర్గపోరుతో వాయిదా పడ్డాయి.44 పాఠశాలల్లో చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, బండ్లపల్లి గ్రామంలోని జెడ్పీ హెచ్‌ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయని ఎంఈఓ క్రిష్ణయ్య తెలిపారు.

### కల్లూరులో ఎన్నిక వాయిదా

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా 45 పాఠశాలుండగా 44 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిగాయి. కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రుల కోరం లేక పోవడం శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి వర్గం, ద్విసభ్య కమిటీ సభ్యులకు చెందిన వర్గం పాఠశాల చైర్మన్ కోసం పోటీ పడ్డారు. దీంతో పాఠశాల సిబ్బంది చైర్మన్ ఎంపికను వాయిదా వేశారు. మర్తాడు హైస్కూల్లో కూడా టీడీపీ వర్గానికి చెందిన వారే పోటీ పడడంతో పాఠశాల సిబ్బంది చీటీలు వేసి ఒకరిని ఎంపిక చేశారు. అలాగే ఎగువపల్లి ప్రాథమిక పాఠశాలలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఎంపిక కావడంతో జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు మళ్లీ ఓటింగ్ జరపాలని పట్టుపడ్డారు. ఒకసారి ఎన్నిక నిర్వహించిన తర్వాత మళ్లీ ఎన్నిక నిర్వహించడం కుదరదని పాఠశాల సిబ్బంది చెప్పడంతో వెనక్కు వెళ్లారు. కనంపల్లిలో కూడా టీడీపీ చెందిన వారే వాదులాడుకున్నారు.

### చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీజే శ్రీహరి

గుత్తి: విద్యార్థులు న్యాయం, చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయ సేవా సమితి చైర్మన్, ఆరో అదనపు జిల్లా జడ్జి ఎం. శ్రీహరి సూచించారు. పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలు, న్యాయం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో వసతులపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. ఎలాంటి సమస్య ఉన్నా న్యాయ సేవా సమితిలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రుద్రాక్షి, కోర్టు సిబ్బంది సాదిక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ–క్రాప్ నమోదు చేస్తున్న ఏఓ లీనా వసుంధర

పామిడి: ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు సంబంధించి రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ లీనా వసుంధర సూచించారు. పామిడి సమీపంలని నీలూరు, తంబళ్ళపల్లి రైతులు సాగుచేసిన పంటలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ ఈ–క్రాప్ నమోదు చేశారు. ఆమె మాట్లాడుతూ మండలవ్యాప్తంగా రైతులు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### ఘనంగా నాగులచవితి



పెద్దవడుగూరు: పేట శివాలయం నాగులకట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పెద్దవడుగూరు/యల్లనూరు: పెద్దవడుగూరు, యల్లనూరు మండలంలో గురువారం నాగులచవితి పండుగ ను ప్రజలు ఘనంగా ప్రారంభించారు. మహిళలు , చిన్నారులు నాగులకట్ట వద్ద పూజలు చేశారు. మరికొందరు మహిళలు పుట్ట వద్దకు వెళ్లి చీరలు , పసుపు , కుంకుమ సమర్పించి , నైవేద్యం పెట్టారు. ఈ సంవత్సరం పంటలు బాగా పండేలా చూడాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిన్నలు, పెద్దలు పాల్గొన్నారు.

# నిబంధనల మేరకు నిర్మాణం చేపట్టాలి



పెట్రోల్ బంకు రికార్డులు పరిశీలిస్తున్న గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి

యాడికి: ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకులను నిర్మించాలని గుంతకల్ ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి నిర్వాహకులను హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని గుత్తి రహదారిలో టింబర్ డిపో, వేరుశనగ ఆయిల్ మధ్యలో నిర్మాణ దశలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకును ఆర్డీఓ పరిశీలించారు. పెట్రోల్ బంకు నిర్వాహకులు ప్రామాణికత పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని స్వయంగా పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. పెట్రోల్ బంకుకు వచ్చే వారికి తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల సదుపాయం, తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన రైతు లక్ష్మీదేవి బుగ్గ రోడ్డులో ఉన్న వ్యయసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుటకు దరఖాస్తు చేసుకోవడంతో ఆర్డీఓ ఆ పొలాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ సమావేశ భవనంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డితో కలిసి వీఆర్‌ఓ, గ్రామ సర్వేయర్లతో సమావేశమయ్యారు. గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన 'జగనన్న రీ సర్వే' గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీటీ బాలమ్మ, రీ సర్వే డీటీ రాజ్‌కుమార్, సీఎస్‌డీటీ సూర్యనారాయణ, ఆర్‌ఐ ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ స్థలాలు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మున్సిపల్ రిజర్వ్‌డ్, లే ఔట్ ఓపెన్ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు మిగులు స్థలం రీ సర్వే చేయించి, కబ్జాకు గురికాకుండా చర్యలు చేపడతామన్నారు. ఈ స్థలానికి సర్వేయర్లు హద్దులు నిర్దేశించేంత వరకు దాని పర్యవేక్షణ బాధ్యతను వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సిబ్బందికి అప్పగిస్తామన్నారు. సర్వే అనంతరం ఆయా స్థలాలకు ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

**పశువులను రోడ్లపైకి వదిలితే గోశాలకు తరలిస్తాం**

గుంతకల్లు పట్టణంలోని ఆవులు, గేదెల పెంపకందారులు వాటిని రోడ్లపైకి వదిలిపెడితే గోశాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పశువులను రోడ్లపైకి వదలడం కారణంగా వాహనదారులకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. ఈ నెల 15 నుంచి పశువులను రోడ్లపైకి వదలరాదని ఆయన పెంపకందారులకు విజ్ఞప్తి చేశారు.

# తాగునీటి సమస్య పరిష్కరించండి



కమిషనర్‌తో మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

గుంతకల్లు: స్థానిక దోనిముక్కల రోడ్డులోని కేజీబీవీ హాస్టల్‌లో తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు వినోద్ ఆవేదన వ్యక్తం చేశాడు. గురువారం ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కేజీబీవీ హాస్టల్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను బృందం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ కేజీబీవీలోని వాటర్ ప్లాంట్‌లోని ఫిల్టర్‌ను ఎన్నిసార్లు మరమ్మతు చేయించిన ఫలితం లేదన్నాడు. దీంతో కలుషిత నీరు సేవిస్తూ విద్యార్థులు కాళ్లనొప్పులు, కీళ్ల నొప్పులు అంటూ రోగుల బారినపడుతున్నారని వాపోయాడు. విద్యార్థుల ఆరోగ్యలను దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీకి సంబంధించిన తాగునీటి కనెక్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివమణి, అఖిల్, రోహిత్, షెక్షావలి, రాము, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలకేంద్రంలోని కేజీబీవీలో తాగునీటి సమస్య వల్ల పిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు ఎంపీడీఓ దస్తగిరి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు వినతి పత్రం అందించారు.

# అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలి



జక్కల చెరువులో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులరెడ్డి



ఓల్డ్ సీఐ బంగ్లా అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ నాగేశ్వరి

గుత్తి రూరల్: అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి సూచించారు. మండలంలోని జక్కలచెరువు, జక్కల చెరువు ఆర్‌ఎస్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. గుత్తి ఐసీడీఎస్ సీడీపీఓ ఢిల్లేశ్వరితో కలసి ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. రోజూ సిబ్బంది ఉదయం 9 గంటలకు కేంద్రాలకు చేరుకుని సమయ పాలన పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఆర్డీఓ స్వయంగా తిని రుచి చూశారు. రోజూ ప్రభుత్వ మెనూ పాటించాలని, భోజనంలో నాణ్యత లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది శారద, రామాంజనమ్మ, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ**

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ సీఐ బంగ్లా అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులు పరిశీలించారు. పౌష్టికాహార పంపిణీపై ఆరా తీశారు. సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త భావమ్మ పాల్గొన్నారు.

### స్తంభాల ఏర్పాటుకు సహకరించండి

పుట్లూరు: అనంతపురం–వైఎస్సార్ జిల్లా మధ్య విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసే స్తంభాల ఏర్పాటుకు రైతులు సహకరించాలని ఆర్‌ఐ క్రిష్టప్ప కోరారు. మండలంలోని శనగలగూడూరు గ్రామంలో గురువారం విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం పవర్ గ్రిడ్, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా గ్రామ సభ నిర్వహించి రైతుల నుంచి అభిప్రాయాల సేకరణ చేపట్టారు. ఒక్కో విద్యుత్ స్తంభానికి రెండు నుంచి మూడు సెంట్ల స్థలం అవసరమని, ఇందుకోసం ఒక్కో రైతుకు రూ.2.5 లక్షలు చెల్లించనున్నట్లు పవర్‌గ్రిడ్ అధికారులు తెలిపారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు విలువైన సారవంతమైన భూములను తాము కోల్పోవాల్సి ఉంటుందని ఎక్కువ మొత్తం పరిహారంగా చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ భాస్కర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# నీటి ఆదాకు వినూత్న ప్రయోగం



ఫిల్టర్ అయిన నీటితో బండ కటింగ్ చేస్తున్న దృశ్యం



మూడు దశల్లో నీటిని ఫిల్టర్ చేస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్: భూగర్భ జలాలను పొదుపు చేసేందుకు కడప స్లాబ్ యూనిట్ల యజమానులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ఉపయోగించిన నీటిని పలు మార్లు వాడుకోవడానికి ఇన్‌ఫిల్ట్రేషన్ వెల్స్‌లను ఏర్పాటు చేసుకున్నారు. తద్వారా లక్షలాది లీటర్ల భూగర్భ జలాలను పొదుపు చేస్తున్నారు. గతంలో సమీపంలో పెన్నానది ఉండటంతో నీటి కొరత ఉండదన్న ఆలోచనతో పెద్దఎత్తున కడపస్లాబ్ యూనిట్లను ఏర్పాటు చేశారు. వర్షాభావం, ఇసుక తరలింపు, పెరిగిన దురాక్రమణలు తదితర కారణాల వల్ల పెన్నానదిలో ఏడాదికేడాది భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. గతంలో కేవలం 50 అడుగుల లోపు లోతులో నీరు ఉండేది. ప్రస్తుతం 200 అడుగలకు పైగా బోర్లు వేసినా అరకొరగా నీరు పడుతోంది. మరోవైపు యూనిట్లకు ఒక సారి మాత్రమే నీరు ఉపయోగించుకుని వృథా నీటి తరలించడం యజమానులకు సమస్యగా మారుతుండేది. కాలువల ద్వారా తరలించినా తరచూ పూడికతో నిండిపోయేది. వాటిని ఎత్తి వేయడం రూ.వేలు ఖర్చు చేయాల్సి వచ్చేది. ఆ మురికి కుంటలు దోమలకు నివాసంగా మారి వివిధ రకాల జబ్బులను కలగజేసేవి. యూనిట్లల్లో పనిచేసే కార్మికులు రోగాలతో బాధ పడేవారు. వారికొచ్చే జబ్బుల వల్ల పని నిలిచి పోయేది. వీటన్నింటికి చెక్ పెడుతూ కడప స్లాబ్ యనిట్ల యజమానులు ఇన్‌ఫిల్ట్రేషన్ వెల్స్‌కు శ్రీకారం చుట్టారు.

**రోజు లక్షల లీటర్ల వినియోగం**

కడప స్లాబ్ యునిట్లల్లో బండలను పాలిష్ చేయడానికి, వాటిని కటింగ్ చేయడానికి నీటి ఉపయోగం తప్పనిసరి. యునిట్‌లో నాలుగు పాలిష్ మిషన్లు, ఒక సెంటర్ కటింగ్ మిషన్, మరో కటింగ్ మిషన్ ఉంటుంది. ఒక్కో మిషన్‌కు రోజు వందల లీటర్ల నీరు వాడాలి. ఒక యూనిట్ వేల లీటర్ల నీటిని ఖర్చు చేస్తోంది. తాడిపత్రి ప్రాంతంలో ప్రస్తుతం ఐదు వందలకు పైగా కడప స్లాబ్ యూనిట్లు పనిచేస్తున్నాయి. దీన్ని బట్టి చూస్తే రోజూ ఈ యూనిట్ల ద్వారా లక్షల లీటర్ల నీటిని వినియోగిస్తున్నారు. అడుగంటిన భూగర్భ జలాలను దృష్టిలో ఉంచుకుని ఇన్‌ఫిల్ట్రేషన్ వెల్ ద్వారా పలు మార్లు ఉపయోగించి నీటిని ఆదా చేస్తున్నారు.

**రాయి కోసేందుకు ..**

గ్రానైట్ యునిట్లల్లో రాళ్లను కోసేందుకు మాత్రమే ఫిల్టర్ చేసిన నీటిని ఉపయోగిస్తున్నారు. నాణ్యత, ఇతర ఉపయోగాలను దృష్టిలో ఉంచుకొని ముడిసరుకు పాలిష్‌కు మాత్రం భూగర్భ జాలాలను వినియోగిస్తున్నారు. తాడిపత్రి పరిసర ప్రాంతాల్లోని వందల సంఖ్యలో గ్రానైట్ యునిట్లలో కటింగ్ మిషన్లకు ఫిల్టర్ నీటిని ఉపయోగించేందుకు పైపులను ఏర్పాటు చేస్తున్నారు. గ్రానైట్ రాళ్లను కోయడానికి కూడా వేలాది లీటర్ల నీటిని ఉపయోగిస్తున్నారు. కటింగ్, పాలిష్ కోసం ఉపయోగించిన నీటిని ఫిల్టర్ చేయడానికి యూనిట్ల అవరణలో తొట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు.

**మూడు దశల్లో మురికి నీరు ఫిల్టర్**

కడప స్లాబ్ యునిట్లల్లో ఉపయోగించిన నీటిని మూడు దశల్లో ప్రకృతి సిద్ధంగా ఫిల్టర్ చేస్తున్నారు. యూనిట్ సమీపంలో మూడు తోట్లు కట్టి వాటిలోకి మురికి నీటిని తరలిస్తారు. మొదట తొట్టిలోకి మురికి నీటిని పంపుతారు. అక్కడ ఫిల్టర్ అయిన నీటిని రెండో తోట్టిలోకి పంపిస్తారు. . అక్కడ నీరు ఫిల్టర్ అయి మూడవ తోట్టిలోకి వెళ్తాయి. మూడవ తోట్టిలోకి వచ్చే సరికి మురికి నీరు తేటగా మారుతుంది. ఈ నీటిని మోటర్ల సాయంతో యునిట్‌పై ఉన్న వాటర్ ట్యాంకులకు పంపుతారు. అక్కడి నుంచి తిరిగి బండలను పాలిష్ చేయడానికి, వాటిని కటింగ్ చేయడానికి ఉపయోగిస్తారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో మోటర్ల ద్వారా అరకొరగా వస్తున్న నీటిని సైతం మూడవ తొట్టిలో నింపుతూ ఉపయోగించుకుంటున్నారు. పూడికతో నిండిన ఇన్‌ఫిల్ట్రేషన్ వెల్స్‌ను తరచుగా శుభ్రం చేస్తూ తిరిగి ఉపయోగించుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల నీటి సమస్య రావడం లేదని యజమానులు పేర్కొన్నారు.

### హెల్మెట్ తప్పనిసరి

అనంతపురం: వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించడం తప్పనిసరి అని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ వీర్రాజు తెలిపారు. గురువారం జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్–2 విభాగం ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.